# 5. గురువులకిదె మా వందనం

**నేపథ్యం:** గురువు అంటే మనలోని అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానజ్యోతిని వెలిగించేవాడు అని అర్థం. అందుకే 'గురుర్బ్రహ్మ, గురుర్విష్ణు, గురుర్దేవో మహేశ్వరా' అని గురువుని మనం గౌరవిస్తాం, అటువంటి గొప్ప గురువు గురించి ఇప్పుడు తెలుసుకుందాం!



చదువు నేర్పే గురువులకిదె మా వందనం
జ్ఞాన దాతల చరణధూళికి వందనం

శాంతమూర్తులు – స్వచ్ఛకీర్తులు
సుజన చంద్రులు – సుగుణసాంద్రులు
గురులు – సురతరులు చదువు...

రామునికి – విలువిద్య నేర్పెను
మౌని విశ్వామిత్రుడు
కృష్ణునే చదివించే
సాందీప జ్ఞాని పవిత్రుడు

ఎంత ఘనులకునైన గాని
గురువులే ప్రత్యక్ష దేవులు చదువు...

రాధాకృష్ణులు – రామకృష్ణులు
విశ్వకవులు – వివేకానందులు
శంకరులు – వేదవ్యాసులు
ఎందరెందరో జగద్గురువులు చదువు...

కోటి సూర్యులున్న – కోటి చంద్రులున్న
గురువు మాట లేకుండా – ఎదచీకటి పోతుందా?
జ్ఞానజ్యోతి వెలిగించి – మము ప్రగతికి నడిపించె
గురువే బ్రహ్మ గురువే విష్ణువు – గురువే మహేశ్వరుడు

ఆ త్రిమూర్తి రూపునకిదె వందనం
ఆ దరుంతరంగున కిదె వందనం చదువు...

**సొంతవాక్యాలు:–** ● స్వచ్ఛకీర్తులు ● పవిత్రుడు ● ఘనులు ● ప్రగతి

## I. వినండి–చెప్పండి

'గురుపూర్ణిమ', 'ఉపాధ్యాయ దినోత్సవం' గురించి తెలుసుకోండి. తరగతిలో చర్చించండి.

## II. పదజాలం పెంపొందించుకుందాం.

1. జ్ఞాన దాతలు = జ్ఞానమునిచ్చేవారు;
   చరణధూళి = పాదాల దుమ్ము;
   స్వచ్ఛకీర్తులు = స్వచ్ఛమైన కీర్తి గలవారు.

భావం: చదువు (విద్య)ను నేర్పే గురువులకు మా నమస్కారం. జ్ఞానాన్నిచ్చే గురువుల పాదధూళికి నమస్కారం. ఆ గురువులు శాంతము మూర్తీ భవించిన వారు, స్వచ్ఛమైన కీర్తిగలవారు, చంద్రుని వంటి వారు, మంచి గుణము గల సముద్రుని వంటివారు. అట్టి గురువులు దేవతలతో సమానమైనటువంటివారు.

2. మౌని = ముని; జ్ఞాని = జ్ఞానవంతుడు;
   పవిత్రుడు = పవిత్రమైన మనస్సు గలవాడు;
   ఘనులు = గొప్పవారు;
   ప్రత్యక్ష దేవులు = కనబడే దైవంవంటివారు.

భావం: ముని విశ్వామిత్రుడు శ్రీరామ చంద్రునకు విద్యనేర్పెను. జ్ఞాని, పవిత్రుడైన సాందీపముని కృష్ణుని చదివించెను. ఎంతటి గొప్పవారికైనను గాని గురువులే కనబడే దైవాలు.

3. విశ్వకవులు = ప్రపంచానికే కవులు;
   జగద్గురువులు = ప్రపంచానికే గురువులు

భావం: రాధాకృష్ణులు, రామకృష్ణులు, విశ్వకవియైన రవీంద్రనాథ ఠాగోర్, వివేకానందులు, ఆదిశంకరాచార్యులు, భారతం రాసిన వేద వ్యాస మహర్షి మరెంతెంత మందో ప్రపంచానికే గురువులు.

4. ఎద = హృదయము, మనస్సు;
   జ్ఞాన జ్యోతి = జ్ఞాన మనెడి జ్యోతి;
   ప్రగతి = అభివృద్ధి.

భావం: కోటి సూర్యులున్నను, కోటి చంద్రులున్నను గురువు మాట లేకుండా హృదయం నందలి చీకటి పోదు. గురువులే జ్ఞానమనెడి జ్యోతిని వెలిగించి మనల్ని అభివృద్ధివైపుకు నడిపించే గురువే బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడును.

## III. చదవండి–ఆలోచించండి–రాయండి.

### అ. కృత్యాన్ని పూర్తి చేయండి.

1. రామునికి, కృష్ణునికి విద్య నేర్పిన గురువులు < ______ / ______
2. ఇద్దరు జగద్గురువులు < ______ / ______

### ఆ. మూడు, నాలుగు వాక్యాలలో జవాబులు రాయండి.

1. గురువు ఎటువంటి వారు?
2. గురువులే ప్రత్యక్ష దేవుళ్ళని ఎట్లు చెప్పవచ్చును?
3. గురువు మాట ఎటువంటిది?

## IV. భాషావగాహన

### అ. వ్యతిరేకపదాలు రాయండి.

1. కీర్తి x ______
2. సుగుణము x ______
3. జ్ఞానము x ______
4. పవిత్రుడు x ______

### ఆ. వాచకాలు రాయండి.

1. మౌని　　2. రాధ
3. జ్యోతి　　4. కృష్ణుడు

- సంగణకములోని నిఘంటువు (ఆన్‌లైన్ డిక్షనరి) సహాయంతో కఠినపదాలకు అర్థాలు తెలుసుకోండి.
- పాఠములో వచ్చిన గురువులను గురించి అంతర్జాలంలో అధిక వివరాలు తెలుసుకోండి.

**నేనివి నేర్చుకున్నా.**



- గురువుల గొప్పదనం గురించి.
- గురువులను గౌరవించుట.

**ఉక్తలేఖనం :–** • స్వచ్ఛకీర్తులు • విశ్వామిత్రుడు • రాధాకృష్ణులు • జ్ఞానజ్యోతి